సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం, 24, జనవరి, 2023



వైభవంగా బ్రహ్మోత్సవాలు

అలంపూర్ జోగులాంబ బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా కొనసాగాయి.

వివరాలు 8లో ▸



నిధులు అందేనా..?

ఉమ్మడి జిల్లాలో 'గ్రామీణ క్రీడా వికాస పథకం' అమలు నిరాశాజనకంగా ఉంది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 30.5 /16.3

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న 'కంటివెలుగు' శిబిరాలు

పాలమూరు: జిల్లావ్యాప్తంగా సోమవారం 45 చోట్ల కంటివెలుగు పరీక్షలు కొనసాగాయి. మొత్తం 22 పీహెచ్‌సీల పరిధిలో మున్సిపాలిటీలు, గ్రామాల్లో శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 8,260 మందికి కంటి పరీక్షలు చేసి 1,458 మందికి రీడింగ్ అద్దాలు అందజేసి, మరో 875 మందికి దూరచూపు సమస్య అద్దాల కోసం ఆర్డర్ పెట్టారు. భూత్పూర్ పీహెచ్‌సీ పరిధిలోని హస్నాపూర్‌లో అత్యధికంగా 295 మందికి, అత్యల్పంగా కోత్లాబాద్‌లో 101 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇక రీడింగ్ అద్దాల పంపిణీలో అత్యధికంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని 36వ వార్డు మోతీనగర్‌లో 97 మందికి, అత్యల్పంగా నవాబ్‌పేట్ పీహెచ్‌సీ పరిధిలోని లింగన్నపల్లిలో ఏడుగురికి ఇచ్చారు. ఈ నెల 19 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 22,923 మందికి పరీక్షలు చేయగా.. 4,983 మందికి అద్దాలు అందజేసి.. 3,160 మంది కోసం ఆర్డర్ పెట్టారు.

రెండో తడికి కేఎస్పీ నీటి విడుదల



దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి సోమవారం ఉదయం రెండో తడి కింద సాగు నీటిని విడుదల చేశారు. డిసెంబర్ 25న మొదటి తడి కింద నీటిని వదిలారు. రెండు వారాలు వదిలిన తర్వాత కొంత విరామం ఇచ్చి మళ్లీ రెండో తడి కింద నీటిని విడుదల చేశారు. యాసంగి పంటల సాగుకు నీటిని విడతల వారీగా వదులుతున్నారు. ప్రాజెక్టు కింద పాత ఆయకట్టు పరిధిలోని 12 వేల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో అధికారులు నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 27.6 అడుగులు ఉంది.

మొక్కజొన్న క్వింటా రూ.2,277



జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,277, కనిష్ఠంగా రూ.2,170 ధరలు లభించాయి. అలాగే వేరుశనగకు గరిష్ఠంగా రూ.8,506, కనిష్ఠంగా రూ.5,602, కందులు గరిష్ఠంగా రూ.6,930, కనిష్ఠంగా రూ.6,244, హంసకు గరిష్ఠంగా రూ.2,151, కనిష్ఠంగా రూ.1,769, ఆర్‌ఎన్ఆర్‌కు గరిష్ఠంగా రూ.2,309, కనిష్ఠంగా రూ.2,209 వచ్చాయి. పొద్దుతిరుగుడు రూ.5,230, ఆముదాలు రూ.6,214, ఉలువలు రూ.5,069 పలికాయి. రైతులకు ఇబ్బందులు కలగనీయకుండా చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన యార్డులో పర్యటించి రైతుల సమస్యలపై ఆరా తీశారు.

కందుల ధర రూ.7,069

దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,069, కనిష్ఠంగా రూ.6,950 ధరలు నమోదయ్యాయి. దిగుబడుల సీజన్ లేకపోవడంతో మార్కెట్‌లో లావాదేవీలు తగ్గుముఖం పట్టాయి.

బదిలీల షెడ్యూల్ విడుదలపై సంబరాలు



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): టీచర్ల బదిలీలు, పదోన్నతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయడంతో పీఆర్టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి పీఆర్టీయూ జిల్లా కార్యాలయం ఎదుట మిఠాయిలు పంచుకుని, టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్ మాట్లాడుతూ 2015 సంవత్సరం తర్వాత ఇప్పుడు పదోన్నతులు కల్పించేందుకు చర్యలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే బదిలీలు సైతం చేపడుతుండటంతో స్పౌజ్‌లో భార్యాభర్తలు ఒకేచోటికి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి, నాయకులు రాజశేఖర్‌గౌడ్, గోపాల్‌నాయక్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైపీ రావు, సాయిరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో సందడి

- పదాధికారుల సమావేశానికి హాజరైన బండి, బన్సల్
- అప్పన్నపల్లి నుంచి భారీగా బైక్ ర్యాలీ
- నేడు రాష్ట్ర కార్యవర్గ సమావేశం
- తరలిరానున్న జాతీయ నేతలు, కేంద్ర మంత్రులు



రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ కార్యదర్శి సునీల్ బన్సల్ తదితరులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను మహబూబ్‌నగర్ కేంద్రంగా నిర్వహిస్తుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన పదాధికారుల సమావేశంలో పాల్గొనేందుకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రాగా.. దారి పొడవునా ఘనస్వాగతం పలికారు. అప్పనపల్లి వద్ద బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి సమావేశం జరిగే భగీరథకాలనీ సమీపంలోని అన్నపూర్ణ గార్డెన్ వద్దకు యువ మోర్చా ఆధ్వర్యంలో వందలాది వాహనాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. సమావేశ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు ఆ పార్టీ శ్రేణులతో సందడిగా మారాయి. పదాధికారుల సమావేశంలో బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ బన్సల్ హాజరుకాగా.. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశాలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, జాతీయ కార్యదర్శి అరవింద్‌మీనన్‌తోపాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి హాజరుకానున్నారు.

కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే..

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జడ్చర్ల– మహబూబ్‌నగర్ రహదారిలోఆర్వోబీ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు వస్తున్న క్రమంలో అప్పనపల్లి వద్ద ఆర్వోబీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ 2021లోనే ఆర్వోబీ పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వ తీరు వల్ల తీవ్ర జాప్యం జరిగిందన్నారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఇది గమనించే కేంద్ర ప్రభుత్వం ఆర్వోబీ నిర్మాణాలకు 100 శాతం నిధులను మంజూరు చేస్తోందన్నారు. త్వరలోనే కేంద్ర మంత్రి చేతులమీదుగా మహబూబ్‌నగర్– జడ్చర్ల ఆర్వోబీ ప్రారంభం కానుందన్నారు.

ముసాయిదా తీర్మానాల్లో కొన్ని..

బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ప్రధానంగా మంగళవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించాల్సిన అంశాలు, రూపొందించాల్సిన ముసాయిదా తీర్మానాలపై చర్చ జరిగింది. ఎన్నికలకు 9 నెలలు మాత్రమే సమయం ఉన్నందున ప్రతి 3 నెలలకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.

→ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు తెలంగాణకు కేంద్రం ఇస్తున్న నిధులు, రాష్ట్రానికి ప్రత్యేకంగా మంజూరు చేసిన పనులు, చేపడుతున్న కార్యక్రమాలపై ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలుపుతూ ప్రత్యేకంగా స్టేట్‌మెంట్ విడుదల చేయాలి.

→ ఎన్నికల ఏడాది అయినందున పెద్దఎత్తున ఉద్యమించేలా కార్యక్రమాలను రూపొందించాలి. కేంద్రం.. తెలంగాణకు సహకరించడం లేదంటూ కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ ఎండగట్టాలి. ఇకపై స్థానిక సమస్యలను ఫోకస్ చేస్తూ టీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను, మోదీ ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టాలి.

→ ఈనెల 27న దేశవ్యాప్తంగా పరీక్షా పే చర్చా కార్యక్రమం నిర్వహణ.. ఇందులో 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్షల సమయంలో పడే ఇబ్బందులు ఏ విధంగా ఉంటాయి..? వాటిని అధిగమించేందుకు ఏం చేయాలనే అంశంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కార్యక్రమం ద్వారా మార్గదర్శనం చేస్తారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 5 స్కూళ్లలో (అందులో ఒకటి లేదా రెండు ప్రభుత్వ) పెద్ద పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రధాని ప్రసంగాన్ని వినిపించాలి. ఈ కార్యక్రమ కన్వీనర్‌గా పాపారావు, కోకన్వీనర్లుగా గుండగాని భరత్, భానుప్రకాశ్‌లను నియమించారు.

→ వచ్చే నెలలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం మోదీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపడంతోపాటు మేధావులు, విద్యావేత్తలు, డాక్టర్లు, ప్రొఫెసర్లతో సెమినార్లు నిర్వహించాలి.

కొలువుల కోలాహలం

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి పెద్దఎత్తున నోటిఫికేషన్లు



- పరీక్షలు రాసేందుకు పోటీపడుతున్న నిరుద్యోగ యువత
- క్రమశిక్షణ, సమయానుగుణంగా చదివితే విజయం తథ్యం
- ఒకేసారి ప్రిపరేషన్‌తో పలు ఉద్యోగాలకు సిద్ధమవ్వాలని నిపుణుల సూచన
- ఈ నెలాఖరు దాకా దరఖాస్తులకు అవకాశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం వివిధ శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు పెద్దఎత్తున నోటిఫికేషన్లు విడుదల చేస్తుండటంతో కొలువుల కోలాహలం నెలకొంది. జిల్లావ్యాప్తంగా వివిధ స్థాయిల్లో పోస్టులకు నిరుద్యోగ యువత సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ల దరఖాస్తు గడువు ఈ నెలాఖరు వరకు ఉండటంతో ఇంటర్నెట్ సెంటర్ల దరఖాస్తుదారుల హడావుడి నెలకొంది. ఇదే సమయంలో ఇటు గ్రంథాలయాలు, అటు కోచింగ్ సెంటర్లు ఔత్సాహిక అభ్యర్థులతో కిటకిటలాడుతున్నాయి.

అవగాహనతో ముందుకు..

ప్రభుత్వం ఎక్కువ సంఖ్యలో నోటిఫికేషన్లు ఇవ్వడంతో అభ్యర్థులు అన్నింటికి దరఖాస్తు చేస్తున్నారు. ఇందులో గ్రూప్స్ మొదలుకొని కోర్టు సబార్డినేట్, అటెండర్ వరకు అనేక పోస్టులు వెలువడ్డాయి. దీంతో చాలామంది ఎలాంటి అవగాహన లేకుండానే అన్ని పోస్టులకు దరఖాస్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొన్ని జిల్లా, జోన్లు, రిజర్వేషన్ల వారీగా పోస్టులు లేకపోయినా దరఖాస్తు చేస్తున్నారు. గ్రూప్స్–1, 2లో సోషల్ స్టడీస్‌కు ఎక్కువ, సెక్రటేరియల్ ఎబిలిటీస్‌కు తక్కువ ప్రాధాన్యం ఉంటుంది. గ్రూప్– 3, 4లో జనరల్ స్టడీస్ 50 శాతం, సెక్రటేరియల్ ఎబిలిటీస్‌కు 50 శాతం వెయిటేజ్ ఉంది. జేఎల్, డీఎల్, టీఆర్టీకి, గ్రూప్స్ సిలబస్‌లో చాలా వ్యత్యాసం ఉంటుంది. అంటే అభ్యర్థి పీజీ సబ్జెక్టు ఆధారంగా సిలబస్ చూసుకోవాలి. అర్హత ఉన్నవారు అన్నింటికి దరఖాస్తు చేయడం వల్ల పలు నోటిఫికేషన్ల సిలబస్ భారీగా పెరిగిపోయి సకాలంలో అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు అవకాశం ఉండకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకోసం కామన్ సిలబస్, అభ్యర్థి ప్రిపరేషన్ సామర్థ్యాన్ని బేరీజు వేసుకుని దరఖాస్తు చేసి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచిస్తున్నారు.

ఆ పోస్టులకు పరీక్షలు పూర్తి..

ఇప్పటికే కానిస్టేబుల్, ఎస్‌ఐ పోస్టులకు ప్రిలిమ్స్ పరీక్ష పూర్తి కాగా ఈవెంట్స్ కూడా పూర్తయ్యాయి. దీంతో ఎంపికైన వారు మెయిన్స్‌కు సిద్ధమవుతున్నారు. ఇక గ్రూప్–1 పరీక్ష సైతం ప్రిలిమినరీ పరీక్ష పూర్తి కాగా.. మెయిన్స్‌కు సిద్ధమవ్వాల్సి ఉంది. అయితే ఎక్కువ సంఖ్యలో నోటిఫికేషన్లు రావడంతో ఏ ఉద్యోగాలకు సిద్ధమవ్వాలో తెలియక అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారు.

సరైన జాబ్ ఎంచుకోవాలి



గ్రూప్–1కు, గ్రూప్–4 సిలబస్‌లో చాలా వ్యత్యాసం ఉంటుంది. అలాగే ఎస్‌ఐ, కానిస్టేబుల్ హెచ్ డబ్ల్యూఓకు తేడా ఉంటుంది. అంటే జాబ్ ఎంపిక చేసుకునే క్రమంలో కామన్ సిలబస్ విధానాన్ని చూసుకోవాలి. ఎక్కువ ఉద్యోగాలు ఎంపిక చేసుకుంటే సిలబస్ పెరిగి ఏ ఉద్యోగానికి కూడా లక్ష్యం చేరలేని పరిస్థితి వస్తుంది. జిల్లా, జోన్‌లో ఎక్కువ పోస్టులు ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి. ఒకటి, రెండు పోస్టులు ఉన్న వాటికి దరఖాస్తు చేసుకుంటే, విపరీతమైన పోటీ వల్ల ఉద్యోగం సాధించకపోవచ్చు.

– విశ్వనాథ్, పీయూ సైకాలజీ విభాగం అధ్యాపకులు, ట్రైనర్

జనరల్ స్టడీస్‌పై దృష్టి..



అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునే క్రమంలో ప్రతి నోటిఫికేషన్‌ను క్షుణ్ణంగా చదవాలి. అందులో విద్యార్హతలు, వయస్సు, జోన్, జిల్లా పోస్టుల సంఖ్య ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. ఎక్కువగా హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్, తెలంగాణ ఉద్యమ చరిత్ర వంటివి అన్ని పోటీ పరీక్షల్లో సింహభాగం ఉంటాయి. అకాడమీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పుస్తకాలను ప్రమాణికంగా చదవాలి. మార్కెట్లో దొరికే ప్రతి పుస్తకాన్నీ చదవడం వల్ల ప్రయోజనం ఉండదు.

– భూమయ్య, పొలిటికల్ సైన్స్ విభాగం, పీయూ

ఉదయం, సాయంత్రం వేళలో..



మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

నోటిఫికేషన్లు వెలువడుతుండటంతో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, గ్రంథాలయాలు కిటకిటలాడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళలో ఆ సెంటర్ల వద్ద అభ్యర్థుల కోలాహలం నెలకొంటుంది. జిల్లాకేంద్రంలో ఉన్న 6 కోచింగ్ సెంటర్లలో యువత శిక్షణ తీసుకుంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం కావడంతో ఎక్కువ కోచింగ్ సెంటర్లు, గ్రంథాలయాలు, ఇతర సదుపాయాలు ఉండడంతో చాలామంది పాలమూరుకు చేరుకుంటున్నారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.8–10 వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. వీటితోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ స్టడీ సర్కిళ్లలోనూ ఉచితంగా అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తెరమీదకు స్టడీ రూంలు అనే కొత్త అంశం తెరమీదకు వచ్చింది. ఇక్కడ అభ్యర్థులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు, సాయంత్రం నుంచి రాత్రి వరకు షిఫ్టుల వారీగా కూర్చొని చదువుకునేందుకు ఒక క్యాబిన్‌ను కేటాయిస్తున్నారు. ఇందులో ఒక చైర్ ప్యాడ్, వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. మధ్యలో చాయ్, బిస్కెట్ వంటివి అందిస్తున్నారు. ఇక్కడ చదువుకునేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అభ్యర్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కువ సమయం కేటాయించేందుకు అవకాశం ఉంది. ఒక్కో అభ్యర్థి నుంచి నెలకు రూ.వెయ్యి నుంచి రూ.1500ల వరకు వసూలు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు పాపయ్య

మహబూబ్‌నగర్ రూరల్: మనువాద నిచ్చెన మెట్ల సమాజంలో తమను విద్యకు దూరం చేసిన మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగానే తమ పోరాటం ఉంటుందని ఎమ్మార్పీఎస్ (టీఎస్) జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య అన్నారు. సోమవారం స్థానిక రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కార్మిక, కర్షక ప్రయోజనాలను దెబ్బతీసేలా వారికి వ్యతిరేకంగా ఎన్నో కఠిన నిర్ణయాలు, చట్టాలు చేసిందన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పజెప్పి రిజర్వేషన్లు తీసేస్తుందని వాపోయారు. మాదిగల చిరకాల కోరిక అయిన ఎస్సీ వర్గీకరణపై తక్షణమే స్పష్టమైన వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరుపతి, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణ, వెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జయన్న, కార్యదర్శులుగా రమేష్, యాదయ్య, నర్సింహులు, కార్యవర్గ సభ్యులుగా కురుమూర్తి, యాదగిరి ఎన్నికయ్యారు.

మన్యంకొండ హుండీ ఆదాయం రూ.51 లక్షలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి హుండీని లెక్కించగా రూ.51,22,904 ఆదాయం వచ్చింది. సోమవారం దేవస్థానంలో చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, ఇన్‌స్పెక్టర్ వీణాధరి, సూపరింటెండెంట్ నిత్యానందచారి సమక్షంలో హుండీ లెక్కించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు శేఖర్, శ్రీనివాసులు, రాజేందర్ రెడ్డి, ఏపీజీవీబీ మేనేజర్ గోవిందరెడ్డి, చెన్నకేశవులు, రాఘవచారి, గౌరి, రమ్య, విజయ్‌కుమార్, హన్మప్ప, రమేష్‌బాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి



సిలిండర్ నుంచి వస్తున్న మంటను ఆర్పుతున్న కలెక్టర్ వెంకట్రావ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా అగ్నిమాపక శాఖ, జడ్చర్ల పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎం పాఠశాల విద్యార్థులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన అగ్ని ప్రమాదాల నివారణ ప్రదర్శనను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు అగ్ని ప్రమదాలు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ఎలా నివారించుకోవాలో కళ్లకు కట్టినట్లు చూపించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరు వారి ఇళ్లలో వంటసోడా 4.5 కిలోలు సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రమాదం జరిగినప్పుడు తినే సోడాను ఉపయోగించి అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ప్రజావాణికి వచ్చే ప్రజలతోపాటు అధికారులు, సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో సోమవారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇదే కార్యక్రమాన్ని మళ్లీ గణతంత్ర దినోత్సవం రోజున పరేడ్‌గ్రౌండ్‌లో చేపట్టాలని సూచించారు. అగ్ని ప్రమాదాలపై ఎస్‌వీకేఎం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన మాక్ డ్రిల్ ఆకట్టుకుంది.

గుర్తింపు కార్డుల అందజేత

అటెండెన్స్ వేసేందుకు ఉద్యోగులకు బయోమెట్రిక్ అటెండెన్స్ గుర్తింపు కార్డులను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలన్నారు. అటెండెన్స్ వేయడంలో ఉద్యోగులకు ఇబ్బందులు రాకుండా గుర్తింపు కార్డులు అందించామన్నారు. అదనపు కలెక్టర్లు తేజాస్, సీతారామారావుతో సహా జిల్లా అధికారులకు, ఉద్యోగులకు కార్డులను అందజేశారు.

త్వరలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ప్రారంభం

పాలమూరు: మండల స్థాయిలో రెడ్‌క్రాస్ సేవలను మరింత బలోపేతం చేయాలని, త్వరలో రెడ్‌క్రాస్ నుంచి మరో బ్లడ్ బ్యాంకు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెంకట్రావ్ తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జనరల్ ఆస్పత్రిలో కార్మికులకు దుప్పట్లు, హైజెనిక్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికీ మండల స్థాయిలో రెడ్‌క్రాస్ సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండల స్థాయిలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకిషన్, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, వైద్యులు జీవన్, శ్యాముల్, జగపతిరావు, కార్కి, శిరీష పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు


- కలెక్టర్ వెంకట్రావ్ ఆదేశం
- 'ప్రజావాణి'కి 126 వినతులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. స్థానికంగా పరిష్కారం అయ్యే సమస్యలను అక్కడే పరిష్కరించాలని లేదంటే వారు జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ప్రజల నుంచి 126 ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు తేజాస్ నందులాల్ పవార్, సీతారామారావు, జెడ్పీ సీఈఓ జ్యోతి, డీఆర్‌డీఓ యాదయ్య, ఆర్‌డీఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వండి

మేమంతా ఇళ్లు లేని నాయిబ్రాహ్మణులం. ఏ ఆధారం లేని అభాగ్యులం. మాకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలి. సంఘం నాయకులు వారికి సంబంధించిన వారికే ఇళ్లు ఇప్పించుకుని మాకు మొండిచేయి చూపించారు. దీనిపై విచారణ జరిపించి నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలి.

మోసం చేసి రాసుకున్నారు..



మాది హన్వాడ మండలం పెద్దదర్పల్లి. గ్రామంలోని సర్వే నంబర్ 86లో నాకు 2.22 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని మా మేనమామ శివయ్య మోసం చేసి నా పేరుపై ఉన్న భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ జరిపించారు. మోసపూరితంగానే భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తేలింది. అయినా భూమి నాకు పట్టా చేయకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నాకు ఏ ఆధారం లేదు. భూమి నాకు ఇప్పించి న్యాయం చేయండి.

పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

పోలేపల్లి శివారులో ఉన్న కాలుష్య కారణమైన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి. అరబిందో, ఎవర్టొజన్, హెల్త్‌కేర్, ఆమ్నిల్ వంటి పరిశ్రమలతో నాకున్న పట్టా భూమి కాలుష్యమయమైంది. పరిశ్రమల నుంచి కాలుష్య జలాలతో పక్కన ఉన్న భూములు నాశనమవుతున్నాయన్నారు. పీసీఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఉన్న కంపెనీలతో ఇబ్బందులు పడుతుంటే మరో పరిశ్రమను నెలకొల్పేందుకు భూమి పూజ చేశారు. భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతుల పరిస్థితి అర్థం చేసుకుని కొత్తగా ఏర్పాటు చేసే కంపెనీలను రద్దు చేయాలి. – మాధవీలత, రాయపల్లి

దళితబంధు ఇప్పించండి



ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న దళితబంధు పథకాన్ని నాకు ఇప్పించాలి. పేదరికంలో ఉన్న నేను వికలాంగుడి. ఏ పని చేసుకోలేని పరిస్థితిలో ఉన్నాను. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దళితబంధు ఇచ్చి ఆదుకోవాలి.

క్లుప్తంగా

పాఠశాలకు వెళ్లడం ఇష్టంలేక ఆత్మహత్య


సాయిప్రసాద్(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: పాఠశాలకు వెళ్లడం ఇష్టంలేక 8వ తరగతి విద్యార్థి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ ఎస్‌ఐ సాయి కుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట లంబాడీతండాలో సోమవారం ఉదయం కావలి సాయిప్రసాద్(14) ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కోయిలకొండ మండలం ఇరంపల్లికి చెందిన కావలి లక్ష్మమ్మ ఇద్దరు పిల్లలతో పట్టణంలో అద్దెకు ఉంటోంది. అయితే సాయిప్రసాద్ కోయిలకొండ సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చిన సాయి ప్రసాద్ తిరిగి పాఠశాల ప్రారంభం చేసిన వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్నాడు. సోమవారం ఉదయం తల్లి కావలి లక్ష్మమ్మ పాఠశాలకు వెళ్లాలని కొడుకు సాయిప్రసాద్‌కు రూ.200ఇచ్చి ఆమె కూలీ పనికి వెళ్లింది. ఉదయం 11గంటల ప్రాంతంలో ఇంటి పక్కల నివాసం ఉండే వారు కావలి లక్ష్మీకి ఫోన్ చేసి నీ కొడుకు ఇంట్లో ఉరి వేసుకున్నాడని సమాచారం ఇవ్వడంతో తల్లి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగు మందు తాగి హోంగార్డు..


పర్వతస్వామి(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: పురుగు మందు తాగి హోంగార్డు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలోని జ్ఞానసరస్వతి దేవాలయ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పదర మండలం వంకేశ్వరానికి చెందిన పర్వతస్వామి(40) నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను జ్ఞాన సరస్వతి దేవాలయం సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం భార్యకు తెలియడంతో సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పర్వతస్వామి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడా, లేదంటే విధినిర్వహణలో వేధింపులు ఉన్నాయా అనే విషయం తేలాల్సిఉంది. హోంగార్డు ఆత్మహత్య సంఘటనకు సంబంధించి సీఐ హన్మంతును వివరణ కోరగా.. విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సంఘటనకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికి ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తికి చెందిన స్వాతి కుటుంబ సమస్యలు భరించలేక సోమవారం మధ్యాహ్న సమయంలో గ్రామంలోని ఊర చెరువులో ఆత్మహత్యకు ప్రయత్నించింది. సమీపంలో ఉన్న అదే గ్రామానికి చెందిన బంగారయ్య అనే వ్యక్తి చెరువులోకి దిగి స్వాతిని రక్షించాడు. కాగా, స్వాతికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం


లక్ష్మి


గాయత్రి

జడ్చర్ల: జడ్చర్లకు చెందిన తల్లీ, కూతురు అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాషమోని లక్ష్మి(28), ఆమె కూతురు గాయత్రి(6)లు తిరిగి ఇంటికి రాలేదని ఆమె సోదరుడు చెన్నయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


స్వామివారి ఆలయంలో భక్తుల అభిషేకాలు

- రెండోరోజు అలంపూర్ ఆలయాలను దర్శించుకున్న ప్రముఖులు
- నదిలో స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండోరోజు సోమవారం వైభవంగా కొనసాగాయి. అర్చకులు ప్రాతః కాల పూజలు, ఆవాహిత దేవత హోమాలు, పవమాన సూక్త పారాయణ సహిత హోమాలు నిర్వహించారు. మరోవైపు కుంకమార్చన, సర్వతో మండలిపై ప్రతిష్ఠించిన సహస్ర కళశాలకు శ్రీ సూక్త సహిత షోడషోపచార పూజలు చేశారు. నవ చండీ పారాయణాలు, చండీహోమాలు నిర్వహించారు. త్రికాల సమయంలో ఆలయం చుట్టూ అష్ట దిక్పాలకులకు బలిహరణాలు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దేవద్రోణి తీర్థం దగ్గర నదీ స్నానాలు ఆచరించారు. బాలబ్రహ్మేశ్వరస్వామికి ఏకవార రుద్రభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి ఖడ్గమాల నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఈఓ పురంధర్, చైర్మన్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.


మంద జగన్నాథంకు అమ్మవారి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ పురంధర్‌కుమార్

పాల్గొన్న ప్రముఖులు

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ఢిల్లీలో అధికార ప్రతినిధి మంద జగన్నాథం, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత దర్శించుకున్నారు. వీరికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో దర్శనాలతో పాటు ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు వార్షిక బ్రహ్మోత్సవాల విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. వీరి వెంట నాయకులు ఆత్మలింగారెడ్డి, పల్లెపాడు శంకర్‌రెడ్డి, రాధాకృష్ణ, మహేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పాలెం వెంకన్న ఆలయంలో..

బిజినేపల్లి: మండలంలోని పాలెం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు కురవి రామానుజాచార్యులు స్వామివారికి శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్, తిరుమంజన సేవ, నిత్య ఆరాధన పూజలు నిర్వహించారు. అలువేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి వారిని అందంగా అలంకరించి మొదటిరోజు పూజలు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ జున్న శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఎమ్మెల్సీని శాలువాతో సత్కరించారు. పాలెం పూర్వ విద్యార్థుల సేవా సమితి చైతన్య కల్చరల్ వారితో నిర్వహించిన మండలస్థాయి భగవద్గీత, భాగవత పద్య పఠనం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎమ్మెల్సీ బహుమతులు అందజేశారు. ఆలయ పాలకవర్గ సభ్యులు గాడి సురేందర్, బోనాసి కురుమయ్య, ఈఓ రంగారావు తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాల మొదటి పూజలు అందుకుంటున్న స్వామివార్లు

గంగాపురం చెన్నకేశవస్వామి ఉత్సవాలు..


అంకురార్పణం చేస్తున్న పండితులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అంకురార్పణ పూజలు ఘనంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహ వాచనం, కంకణ ధారణ, మృత్సంగ్రహణం చేసి అంకురార్పణం జరిపించారు. అనంతరం పుట్టమన్ను తీసుకొచ్చి హోమగుండం నిర్మాణం, అగ్నిప్రతిష్ఠ చేశారు. మేళతాళాల నడుమ స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల నిర్వహణపై ఆర్డీఓ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరగనుంది.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌ను నిలదీస్తున్న అనిరుద్‌రెడ్డి, బాధితులు

- బాధితులతో కలిసి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన

జడ్చర్ల: మండలంలోని కావేరమ్మపేట, మాచారం శివార్లలో 30ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన వెంకటాద్రి వెంచర్ సీ బ్లాక్ ప్లాట్లను వ్యవసాయ భూమిగా ఇతరులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బాధితులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ భర్త రవీందర్ పలువురు పదవులు చేపట్టిన వెంటనే నియోజకవర్గంలో భూ దందాలకు తెరలేపారని అన్నారు. దశాబ్దాల కిందట ఏర్పాటైన వెంచర్లలో బెదిరింపులకు దిగి ప్లాట్లను ఆక్రమించి అక్రమ సంపాదిస్తున్నారని తెలిపారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతో తమ పిల్లల భవిష్యత్ అవసరాలకు ప్లాట్లు కొనుగోలు చేసిన వారు భూఆక్రమణదారులతో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, పోలీసులు సైతం అక్రమార్కులకు సహకరించడంతో బాధితులకు న్యాయం చేసే వారే కరువయ్యారని అన్నారు. ఇప్పటికైనా బాధితులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. తదుపరి పోలీస్‌స్టేషన్‌లో ఆక్రమణదారులపై ఫిర్యాదు చేశారు.

తహసీల్దార్‌పై ఆగ్రహం

ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారన్న అభియోగాలతో తహసీల్దార్‌పై బాధితులతో పాటు అనిరుద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్లాట్లను వ్యవసాయ భూమిగా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. ఆయా భూమిలో వందలాది మంది ప్లాట్లు కొనుగోలు చేశారని, వారిని రోడ్డున పడేసే విధంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. ప్లాట్లుగా పేర్కొంటున్న భూమి తమ రికార్డులలో వ్యవసాయ భూమిగా ఉండడంతోనే రిజిస్ట్రేషన్ చేశామని తహసీల్దార్ తెలిపారు. అయినా సదరు రిజిస్ట్రేషన్‌ను బ్లాక్ చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

కేసు నమోదు

కావేరమ్మపేట, మాచారం శివారులో వెంకటాద్రి వెంచర్ సీ బ్లాక్‌లోని ప్లాట్లను వ్యవసాయ భూమిగా పేర్కొంటూ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆక్రమణదారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్ బాబు తెలిపారు. దాదాపు 30 ఏళ్ల క్రితం తాము కొనుగోలు చేసిన ప్లాట్లను అక్రమంగా విక్రయించిన డీవీ రంగారావు, కొనుగోలు చేసిన మాచారం గ్రామానికి చెందిన సురేందర్ రెడ్డి, కర్నూల్‌కు చెందిన రమేశ్ అలియాస్ రమణపై ప్లాట్లు కొనుగోలు చేసిన జనార్దన్‌రెడ్డి మరికొందరు బాధితులు సోమవారం ఫిర్యాదు చేశారన్నారు.

బాధితులు ఆందోళన చెందొద్దు

ప్లాట్ల కొనుగోలుదారులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ప్లాట్లకు సంబంధించి వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అన్ని పార్టీల వారు ఉంటారని, కానీ తమ పార్టీ నేతలను లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం తగదన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే సదరు భూమిని చదును చేసిన వారిపై చర్యలకు పోలీసులను ఆదేశించామని చెప్పారు.

నియోజకవర్గంలో అడుగుపెట్టనివ్వం

- నాకు సవాల్ విసిరే స్థాయి ఎమ్మెల్యే మర్రికి లేదు: నాగం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: తనకు సవాలు విసిరే స్థాయి నల్లమట్టి దొంగ, స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డికి లేదని మాజీమంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఆయన చేసిన అభివృద్ధి ఎక్కడ ఉందో చెప్పాలని, ఆరు నెలలో మార్కండేయ లిఫ్ట్ పూర్తి చేయకపోతే నియోజకవర్గంలోకి అడుగు పెట్టనివ్వబోమని అన్నారు. జిల్లా కేంద్రాలకు వచ్చినట్లే మన జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల వచ్చిందే తప్పా.. ఇందులో మర్రి జనార్దన్‌రెడ్డి కృషి లేదన్నారు. తాను ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలోనే నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి తాగునీరు, సీసీ రోడ్లు, అవసరమైన గ్రామంలో సబ్‌స్టేషన్ వేయించానని చెప్పారు. కంటివెలుగు పథకం అంత మంచిదే అయితే సీఎం కేసీఆర్ ఢిల్లీలో ఎందుకు కంటి పరీక్షలు చేయించుకున్నారని ప్రశ్నించారు.

నాగం సవాల్ స్వీకరిస్తున్నా..

- అలా చేస్తే పోటీ నుంచి తప్పుకుంటా: మర్రి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: మార్కండేయ లిఫ్ట్ విషయంలో నాపై నాగం జనార్దన్ రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఒకవేళ 6 నెలల్లో ఆ ఎత్తిపోతల పనులు పూర్తి చేయిస్తే, రానున్న ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొని, నాకు మద్దతుగా ప్రచారం చేస్తావా అంటూ ప్రతి సవాల్ చేశారు. 6నెలల్లో ఎత్తిపోతల ద్వారా నీళ్లు ఇవ్వకపోతే ఈ ప్రాంతంలో తిరగను. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని, నాగం తరఫున ప్రచారం చేస్తానన్నారు. రేవంత్‌రెడ్డి చేత నన్ను, సీఎం కేసీఆర్‌ను తిట్టించడానికే నాగం రూ.5కోట్లు ఖర్చు పెట్టి బహిరంగ సభ పెట్టుకున్నాడని ఎమ్మెల్యే మర్రి విమర్శించారు. జనవరి 7వ తేదీన మార్కండేయ ఎత్తిపోతల పైలాన్ వద్ద నాగం కాలు మోపడంతో ఆ ప్రాంతం అపవిత్రమైందన్నారు. ఆ పైలన్‌ను కృష్ణానీటితో సోమవారం కడిగారు. బిజినేపల్లి మండలంలో రైతుల కోసం రీడిజైన్ చేయడం వల్ల పనులు ఆలస్యమైందని అన్నారు.

దారి దోపిడీ ఘటనలో 10 మంది అరెస్టు

- కారు, బొలెరో.. రూ.4.40 లక్షల నగదు స్వాధీనం
- 72గంటల్లోనే కేసు ఛేదించాం: ఎస్పీ రంజన్‌రతన్‌కుమార్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రంజన్‌రతన్ కుమార్


స్వాధీనం చేసుకున్న నగదు

ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్–రాయచూర్ రహదారిపై ఈ నెల 20న జరిగిన అంతరాష్ట్ర దారి దోపిడీ కేసును 72గంటల్లోనే ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ రంజన్‌రతన్‌కుమార్ అన్నారు. సోమవారం కోదండాపురం సీఐ కార్యాలయంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకి చెందిన కుమ్మరి శ్రీనివాసులు వినాయక విగ్రహాల తయారీ, పొగాకు ఉత్పత్తుల వ్యాపారం చేస్తుంటాడు. ఆయన ఆదేశాల మేరకు నందికొట్కూర్‌కి చెందిన తిక్కస్వామి, మౌలాలి కలిసి ఈ నెల 20న తిక్కస్వామికి చెందిన బొలేరో వాహనంలో ఎరిగెర, రాయచూరు ప్రాంతాల నుంచి రూ. 4.40 లక్షల విలువ గల 30పొగాకు ఉత్పత్తుల సంచులను తీసుకొని నంద్యాలకు బయలు దేరారు. మార్గమధ్యలో పెద్దపోతులపాడు స్టేజీ సమీపాన స్పీడ్ బ్రేకర్ రావడంతో వాహనం కాస్తా నెమ్మదించగా.. కర్నూలుకు చెందిన కొత్త సుబ్బయ్య, నాగేళ్ల వెంకట్రామయ్య, షేక్ ఖాజా భాష, కరడ జయ్యన్న, బోయ నరేష్, కరడ వినోద్‌కుమార్, బొల్ల నవీన్, సిరివేరు రాఘవేంద్ర, మండ్ల పరుశరాముడు, బోయ మనోహర్‌తో కలిసి బొలెరోను అడ్డగించారు. డ్రైవర్ తిక్కస్వామి, అతని సహాయకుడు మౌలాలిని బలవంతంగా కిందికి దింపి, వారిపై దాడి చేయడంతోపాటు సెల్‌ఫోన్లు లాక్కొని బొలెరోని పెద్దపోతులపాడు వైపు తీసుకెళ్లారు. అందులో ఉన్న 30 సంచుల పొగాకు ఉత్పత్తులని మరో బొలెరోలో వేసుకొని సెల్‌ఫోన్లు తిరిగి ఇచ్చి ఎవరికైనా చెబితే అంతు చూస్తామని బెదిరించి వెళ్లారు. ఈ విషయాన్ని బాధితులు ఇద్దరు వ్యాపారి కుమ్మరి శ్రీనివాసులుకు చెప్పగా ఆయన ఫిర్యాదు మేరకు ఉండవెల్లి పీఎస్‌లో కేసు నమోదు చేశారు. అలంపూర్ సీఐ సూర్యానాయక్ ఆధ్వర్యంలో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో 72 గంటల్లోనే కేసును ఛేదించామని ఎస్పీ వివరించారు. 10 మంది నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ నిమిత్తం అలంపూర్ కోర్టులో హాజరుపర్చామని, వారి నుంచి రూ.4.40 లక్షల నగదు, 7 మొబైల్స్, బొలెరో, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి వారికి రివార్డులు అందజేశారు. విలేకర్ల సమావేశంలో డీఎస్పీ రంగస్వామి, సీఐ సూర్యానాయక్, ఎస్‌ఐలు వెంకటస్వామి, శ్రీహరి, బాలరాజు, ఆనంద్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వైభవంగా దీపోత్సవం


విద్యుత్ దీపాల వెలుగులో దర్గా

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని హజ్రత్ అబ్దుల్ ఖాదర్‌షా రహెమతుల్లా అలై 84వ ఉర్సు వైభవంగా కొనసాగుతుంది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దీపాలు వెలిగించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహబూబ్‌నగర్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు దర్గాను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. కార్యక్రమంలో దర్గా ముతవల్లీ మహ్మద్‌అబ్దుల్ జమీర్‌ఖాద్రి పాల్గొన్నారు.

భర్త ఆచూకీ కోసం ఫిర్యాదు


శేషయ్య (ఫైల్)

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటకు చెందిన చెన్న శేషయ్య కనిపించడం లేదని భార్య చెన్న లక్ష్మమ్మ సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్‌గౌడ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొన్ని రోజుల కిందట ఇంటి నుంచి హైదరాబాద్‌కు వెళ్లిన చెన్నశేషయ్య 14వ తేదీన తిరిగి ఇంటికి వచ్చాడన్నారు. ఈనెల 18న రాత్రి భార్యపై అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఎక్కడ వెతికినా కనిపించడం లేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆత్మకూర్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఇంట్లో నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేశ్‌గౌడ్ తెలిపారు. పట్టణానికి చెందిన నల్లగొండ రవికుమార్ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం దాడులు నిర్వహించగా, 14 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయని.. పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పజెప్పినట్లు వివరించారు.

అదుపుతప్పి ఆటో బోల్తా: చిన్నారులకు గాయాలు

- చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలింపు
- ఒకే ఆటోలో 15 మంది విద్యార్థులు, ఇద్దరు పెద్దలు


గాయాలపాలైన చిన్నారులు

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని ర్యాలంపాడ్‌కు చెందిన విద్యార్థులు గ్రామం నుంచి అలంపూర్ పాఠశాలకు వస్తున్న ఆటో తుంగభద్ర నది వంతెన సమీపంలో అదుపు తప్పి బోల్తా పడి, చిన్నారులు గాయాలపాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆటోలో 15 మంది విద్యార్థులు ఇద్దరు ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు. అందులో ఒకే ప్రైవేట్ పాఠశాలకు చెందిన మహేష్, నేహ, సతీష్, సౌమ్య, అహల్య, ప్రణయ్, లాస్య, పూజిత, ఆసీఫ్, ఆఫ్రీన్, వరణ్య, మేఘమాల, సుదీక్ష, మీణ, లక్ష్మణ్, నూర్జహన్ ఉన్నట్లు పిల్లల తల్లిదండ్రులు తెలియజేశారు. ఇందులో ఆటో ఓనర్ రమేష్ కుమారుడు మహేష్ తలకు గాయం కావడంతో కర్నూల్ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. రమ్యలత తలకు, మోకాలకి గాయాలయ్యాయి. మూడేళ్ల బాలుడు తహర్షకు వీపు వెనుక భాగంలో దెబ్బ తగలడంతో ఎక్స్‌రే నిమిత్తం కర్నూల్‌కు తీసుకెళ్తున్నట్లు తండ్రి రాముడు తెలియజేశారు. పల్లవి మోకాలికి గాయామైంది. మిగతా వారు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. అందరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో ఆస్పత్రికి పిల్లల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సమయానికి రాని బస్సు..

గ్రామానికి వస్తున్న బస్సు ఇష్టానుసారంగా రావడంతో పిల్లలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. బస్సు సరైన సమయానికి వస్తే ఇబ్బందులు, తిప్పలు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్స నిమిత్తం తరలించాం..

ఆటోలో ప్రమాదానికి గురైన విద్యార్థులను అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తీసుకెళ్లినట్లు ఎస్‌ఐ శ్రీహరి చెప్పారు. మహేష్ అనే అబ్బాయిని కర్నూల్ తరలించామన్నారు. మిగితా వారికి చిన్న గాయాలు అయ్యాయని, చాందుబాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలియజేశారు.

కారు, ఆటో ఢీ: ఆరుగురికి గాయాలు

కోడేరు: కారు, ఆటో ఢీకొని ఆరుగురికి గాయాలైన సంఘటన కోడేరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాయిపల్లికి చెందిన కేతూరి భవానిరాజు అనే వ్యక్తి తన కారులో కోడేరుకు వస్తుండగా.. ఎత్తంకు చెందిన సల్మాన్‌రాజు తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని కొల్లాపూర్ వెళ్తున్నాడు. ఎత్తం క్రాస్ రోడ్డు వద్ద కారు అతివేగంగా ఆటోను ఢీకొట్టడంతో రాజు, బచ్చిరెడ్డి, ఈశ్వరయ్య, శాంతమ్మ, కృష్ణ, సాయిలుకు గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన వారిని కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలియజేశారు.

సినీ నటుడు సుధీర్‌వర్మ ఆత్మహత్య



దొండపర్తి (విశాఖ దక్షిణ): వర్ధమాన తెలుగు సినీ నటుడు కలిదిండి సుధీర్‌వర్మ (34) బలవన్మరణానికి పాల్పడ్డారు. 2013లో 'సెకండ్ హ్యాండ్' సినిమాతో సుధీర్‌వర్మ టాలీవుడ్‌లోకి హీరోగా ఎంట్రీ ఇచ్చారు. 2016లో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు సమర్పణలో రిలీజైన కుందనపు బొమ్మ సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుస్మిత నిర్మించిన 'షూటౌట్ ఎట్ ఆలేరు' వెబ్ సిరీస్‌లోనూ నటించారు. సుధీర్‌వర్మ కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే గత వారంలో హైదరాబాద్‌లో విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆరోగ్య క్షీణించడంతో తన బంధువుకు ఫోన్‌చేసిన సుధీర్ ఆరోగ్య సమస్యల కారణంగా మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో పురుగు మందు తాగినట్టు చెప్పగా.. అతడు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించాడు. కాగా, సుధీర్‌వర్మను ఆస్పత్రిలో ఎవరికీ చెప్పకుండా, డిశ్చార్జ్ తీసుకోకుండా ఈ నెల 21న విశాఖ తీసుకువచ్చి మహారాణిపేట ప్రాంతంలోని ఎల్‌జీ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందించి, సుధీర్ ఆత్మహత్య యత్నం చేసిన విషయాన్ని మహారాణిపేట పోలీసులకు తెలియజేశారు. దీంతో పోలీసులు ఆస్పత్రికి వెళ్లి సుధీర్ నుంచి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో సుధీర్ తాను ఓ వాటర్‌ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులకు చెప్పాడు. సోమవారం వేకువజామున 4.18 గంటలకు సుధీర్‌వర్మ చనిపోయినట్టు ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయమై ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా.. పోస్టుమార్టం చేయకుండానే వారు దహన సంస్కారాలు పూర్తి చేశారు.

మూడో రోజు 2.16 లక్షల మందికి కంటి పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూడో రోజు సోమవారం 2.16 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడించింది. 49,807 మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణీ చేశారు. 33,804 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ కోసం రెఫర్ చేశారు. 1.32 లక్షల మందికి కంటి సమస్యలు లేనట్లు గుర్తించారు. కాగా, కంటి వెలుగులో మొత్తం ఇప్పటివరకు 6.22 లక్షల మందికి కంటి పరీక్షలు చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ తెలిపింది.

సీజే స్థానాన్ని కించపరిచింది!

▶ మొదటి పేజీ తరువాయి

విచారించడం ద్వారా సీజే స్థానాన్ని వెకేషన్ బెంచ్ కించపరిచిందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రతి వెకేషన్ జడ్జి ఇలాగే వ్యవహరిస్తే వ్యవస్థ ఏమవుతుందంటూ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి వాటిని అనుమతిస్తే రేపు ప్రతి వెకేషన్ జడ్జి ప్రధాన న్యాయమూర్తిలా వ్యవహరిస్తారని వ్యాఖ్యానించింది. ఇది తేలిగ్గా తీసుకునే విషయం ఎంత మాత్రం కాదని, మూలాల్లోకి వెళ్లి ఈ వ్యవహారాన్ని తేలుస్తామని సీజే ధర్మాసనం తేల్చి చెప్పింది. వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో తనకు ప్రతిదీ తెలుసని సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. హైకోర్టు రిజిస్ట్రీ తనకు ఎప్పటికప్పుడు ప్రతి విషయాన్ని నివేదించిందన్నారు. తనకు ఏమీ తెలియదనుకుంటే అది పెద్ద పొరపాటే అవుతుందని స్పష్టం చేశారు. ప్రధాన న్యాయమూర్తికి మాత్రమే సొంతమైన అధికారాల విషయంలో తాను నిక్కచ్చిగా వ్యవహరించి తీరుతానన్నారు. ఇదే సమయంలో జీవో 1పై వెకేషన్ బెంచ్ ముందు పిల్ దాఖలు చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కాకా రామకృష్ణ తీరును సైతం సీజే ధర్మాసనం తప్పుబట్టింది. ఏమంత అత్యవసరం ఉందని హడావుడిగా పిల్ దాఖలు చేశారని రామకృష్ణను నిలదీసింది. మీరేమైనా ధర్నా చేశారా? రాస్తారోకో చేశారా? సమావేశాలు పెట్టారా? ఏం చేస్తే మీకు ఇబ్బంది కలిగింది? అని ధర్మాసనం ప్రశ్నించింది. తక్షణ ఇబ్బంది లేనప్పుడు ఏం మునిగిపోయిందని సెలవుల్లో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారని ప్రశ్నించింది. మధ్యంతర ఉత్తర్వులు పొందిన తరువాత ఏమైనా కార్యక్రమాలు చేపట్టారా? అంటే అదీ లేదని, ఇలాంటి పిటిషన్ వేసి తీవ్ర గందరగోళ పరిస్థితి సృష్టించారని రామకృష్ణతో పాటు ఆయన తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్‌ను ఉద్దేశించి ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టు నుంచి ఉత్తర్వులు పొందేందుకు ఇలాంటి పరిస్థితిని సృష్టించారని, దీనికి సమాధానం చెప్పి తీరాలంది. మీ చర్యలు ప్రధాన న్యాయమూర్తికి బాధ కలిగించాయంది. ఇలాంటి చర్యలు వ్యవస్థకు ఎంత మాత్రం మంచివి కాదంది. జీవో 1పై రామకృష్ణ దాఖలు చేసిన పిల్‌లో ఇరుపక్షాల వాదనలు ముగియడంతో పాటు ఇదే అంశంపై బీజేపీ, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నేతలు వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం విచారణ జరుపుతామని ధర్మాసనం ప్రకటించింది.

సెలవుల్లో వ్యూహాత్మకంగా పిల్..

రోడ్లు, రోడ్ మార్జిన్‌లలో బహిరంగ సభల ఏర్పాటును నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2న జారీ చేసిన జీవో 1ని సవాల్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కాకా రామకృష్ణ సంక్రాంతి సెలవుల్లో అత్యవర కేసులను మాత్రమే విచారించే హైకోర్టు వెకేషన్ బెంచ్ ముందు వ్యూహాత్మకంగా పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ దేవానంద్, జస్టిస్ కృపాసాగర్ ధర్మాసనం జీవో 1 అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. రామకృష్ణ వ్యాజ్యంపై విచారణ జరపాలని సీజే ధర్మాసనానికి స్పష్టం చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం సోమవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపింది.

ఆ విచక్షణాధికారం వెకేషన్ కోర్టుకుంది...

పిటిషనర్ రామకృష్ణ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ వాదనలు వినిపిస్తూ వెకేషన్ కోర్టులో ఎలాంటి కేసులను విచారించాలన్న అంశంపై హైకోర్టు రిజిస్ట్రీ నోటిఫికేషన్‌ను చదివి వినిపించారు ఈ నోటిఫికేషన్ ప్రకారం పరిపాలన, విధానపరమైన నిర్ణయాలపై వెకేషన్ కోర్టు విచారణ జరపరాదన్నారు. అయితే ప్రభుత్వ చర్యలు పౌరుల ప్రాథమిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని కోర్టు భావించినప్పుడు విచారణ జరిపే విచక్షణాధికారం వెకేషన్ కోర్టుకు ఉందన్నారు. ప్రస్తుత వ్యాజ్యాన్ని కూడా వెకేషన్ కోర్టు అదే తరహాలో భావించి విచారణ జరిపిందని చెప్పారు. ఫలానా తరహా వ్యాజ్యాలను మాత్రమే విచారించాలని నోటిఫికేషన్‌లో ఉందని, అదే సమయంలో ఫలానా తరహా వ్యాజ్యాలను విచారించకూడదని ఎక్కడా లేదన్నారు. ఈ సమయంలో సీజే స్పందిస్తూ.. సెలవుల్లో ప్రతి కేసునూ ముఖ్యమైనదిగానే భావించి వెకేషన్ కోర్టులు విచారణ జరుపుతూపోతే ఇక వ్యవస్థ ఏం కావాలని ప్రశ్నించారు. ఈ వ్యవహారం మీరు చెబుతున్నంత సింపుల్ విషయం కాదని స్పష్టం చేశారు. ప్రధాన న్యాయమూర్తికి మాత్రమే సొంతమైన హక్కులు ఏమిటో తనకు బాగా తెలుసని, ఇందులో ఎలాంటి సందేహానికి తావు లేదని తేల్చి చెప్పారు.

ప్రజలను కలుసుకునే హక్కు పార్టీలకు ఉంది..

అనంతరం రాజు రామచంద్రన్ వాదనలను కొనసాగిస్తూ జీవో 1లోని అంశాలను చదివి వినిపించారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై బహిరంగ సభలను నిషేధించారని పేర్కొన్నారు. సాధారణంగా పాదయాత్రలన్నీ జాతీయ రహదారుల వెంబడే సాగుతాయన్నారు. మునిసిపల్, పంచాయతీ రోడ్లు ఇరుకుగా ఉంటాయని, అక్కడ బహిరంగ సభలకు అనుమతినిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని చెబుతున్నారన్నారు. అరుదైన, అసాధారణ పరిస్థితుల్లో మాత్రం అనుమతిస్తామని చెబుతున్నారని, అయితే ఆ పరిస్థితులు ఏమిటో నిర్దిష్టంగా చెప్పడం లేదన్నారు. అధికార పార్టీ సభలు నిర్వహించుకునేందుకు ఈ అరుదైన, అసాధారణ పరిస్థితులను కారణంగా చూపి పోలీసులు అనుమతులు ఇస్తారని, ప్రతిపక్ష పార్టీల విషయంలో భిన్న వైఖరిని అవలంబిస్తారని తెలిపారు. ప్రజలను కలుసుకునే హక్కు రాజకీయ పార్టీలకు ఉందని, దీన్ని జీవో 1 హరిస్తోందన్నారు. సభలు, యాత్రలు ఎక్కడ ఎలా నిర్వహించాలన్నది ఆయా పార్టీలు నిర్ణయిస్తాయని, షరతులతో అనుమతులు ఇవ్వడం ఇప్పటివరకు జరుగుతూ వచ్చిందన్నారు.

మా అభ్యంతరాలను సైతం వెకేషన్ బెంచ్ వినలేదు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో ధర్మాసనానికి వివరించారు. పిల్‌ను విచారించే విషయంలో తన అభ్యంతరాన్ని వినేందుకు సైతం వెకేషన్ బెంచ్ నిరాకరించిందన్నారు. సాధారణంగా హౌస్‌మోషన్, లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కారణాలను స్పష్టంగా వివరిస్తారని, ప్రస్తుత వ్యాజ్యంలో మాత్రం అలాంటిది ఏమీ లేదన్నారు. ఈ వ్యాజ్యాన్ని విచారించే రోస్టర్ లేదని చెప్పినా కూడా వెకేషన్ బెంచ్ వినిపించుకోలేదన్నారు. సీజే నిర్ణయించిన రోస్టర్‌కు భిన్నంగా వెకేషన్ బెంచ్ మరో రోస్టర్‌ను నిర్ణయించిందన్నారు. వెకేషన్ కోర్టులో సాధారణంగా అత్యవసర కేసులను సీజే అనుమతి తీసుకున్న తరువాతే విచారిస్తారని, ఇది సంప్రదాయంగా వస్తోందన్నారు. పిటిషనర్ బెంచ్ హంటింగ్‌కు పాల్పడ్డారన్నారు.

రోడ్‌షోలపై ఎలాంటి నిషేధం లేదు..

రోడ్ షోలు, ఊరేగింపులను జీవో 1 నిషేధించడం లేదని ఏజీ పేర్కొన్నారు. కేవలం రోడ్లపై జరిగే సభలకు మాత్రమే ఆ జీవో ఉద్దేశించిందని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు కందుకూరులో నిర్వహించిన రోడ్‌షో కారణంగా పలువురు మరణించగా మరికొందరు గాయపడ్డారన్నారు. ఇలాంటి ఘటనలను నివారించేందుకు చట్ట నిబంధనలను అనుసరించి పోలీసులకు తగిన మార్గనిర్దేశం చేస్తూ జీవో 1 జారీ అయిందన్నారు. నిర్దిష్ట ప్రదేశం లేదా ప్రాంతంలో సభ నిర్వహించుకునేందుకు అనువైన మైదానంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలేవీ ఆచరణ సాధ్యం కాని పరిస్థితులు ఉంటే అలాంటి సమయంలో అసాధారణ పరిస్థితుల కింద అనుతులు ఇస్తామన్నారు. కేవలం ఊహల ఆధారంగా రామకృష్ణ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారన్నారు. కందుకూరుతో పాటు గుంటూరులో సైతం తొక్కిసలాట జరిగిందని, ఈ రెండు ఘటనలపై విచారణ కమిషన్‌ను నియమించినట్లు శ్రీరామ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ సమయంలో సీజే జోక్యం చేసుకుంటూ.. రోడ్‌షోలు, ఊరేగింపులపై నిషేధం లేదన్న వాదనను రికార్డ్ చేయమంటారా? అని ప్రశ్నించగా నిస్సందేహంగా రికార్డ్ చేయవచ్చని ఏజీ నివేదించారు. ఈ విషయాన్ని తమ కౌంటర్‌లో సైతం స్పష్టం చేశామన్నారు. ఏజీ వాదనలు ముగియడంతో రాజు రామచంద్రన్ జోక్యం చేసుకుంటూ జీవో 1 విషయంలో మధ్యంతర ఉత్తర్వుల కోసం అభ్యర్థించారు. అయితే ఈ వ్యవహారంలో వాదనలు ఇంకా పూర్తి కాలేదని, మధ్యంతర ఉత్తర్వులు సాధ్యం కాదని ధర్మాసనం తేల్చి చెప్పింది. జీవో 1పై బీజేపీ నేత కన్నా, టీడీపీ నేత కొల్లు రవీంద్ర, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి

▶ మొదటి పేజీ తరువాయి

కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.

చేనేత కళాకారులను మరింత ప్రోత్సహించాలి

2014 నుంచి తెలంగాణతో అమెజాన్ అనుబంధం పెరుగుతూ వచ్చిందని, అమెరికా తరువాత అతి పెద్ద డేటా సెంటర్, ఆసియాలోనే అతిపెద్ద ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ హైదరాబాద్‌లోనే ఉన్నాయని మంత్రి చెప్పారు. తాజాగా అమెజాన్ ఎయిర్ కూడా ఏర్పాటు కావడం ఎంతైన హర్షణీయమైన అంశం అని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన ప్రగతిని సోదాహరణంగా వివరించిన కేటీఆర్.. అమెజాన్ ఎయిర్ ఏర్పాటుతో తెలంగాణ వ్యాపారులకు తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు మరిన్ని అవకాశాలు దక్కడమే కాకుండా, యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభించనున్నాయని వివరించారు. అమెజాన్ ఇప్పటికే తెలంగాణలోని 56 గ్రామాల్లో 4,500 మంది చేనేత కళాకారులకు మద్దతిస్తోందని, వీరికి మరింత ప్రోత్సాహం ఇవ్వాలని, పోర్టల్ ద్వారా వారి ఉత్పత్తులు మరింత ఎక్కువగా అమ్ముడయ్యేలా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మరింత వేగంగా డెలివరీ: అఖిల్ సక్సేనా

సరుకుల రవాణా కోసం దేశంలోనే మొట్టమొదటిసారి విమానాలను ఉపయోగిస్తున్నామని, దీనివల్ల వినియోగదారులకు మరింత వేగంగా సరుకులు డెలివరీ అవుతాయని అమెజాన్ కస్టమర్ ఫుల్‌ఫిల్‌మెంట్ విభాగం ఉపాధ్యక్షుడు అఖిల్ సక్సేనా తెలిపారు. క్విక్ జెట్ అనే సంస్థ ద్వారా తాము ఈ సర్వీసులను నిర్వహిస్తున్నామని, విమానాల సర్వీసు, నిర్వహణ మొత్తం క్విక్ జెట్‌దేనని చెప్పారు. తొలిదశలో భాగంగా రెండు బోయింగ్ 737–800 విమానాలను ఉపయోగిస్తున్నామని, ఒకటి ఢిల్లీలో, రెండోది హైదరాబాద్‌లో ఉంటుందని చెప్పారు. ఒక్కో విమానంలో ఇరవై వేల షిప్‌మెంట్‌లను రవాణా చేయవచ్చని వివరించారు. ఢిల్లీ, హైదరాబాద్‌తో పాటు ముంబై, బెంగళూరుకు సరుకుల రవాణా జరుగుతుందని తెలిపారు.

ఇద్దరి పిల్లలను నదిలోకి తోసి..
గోదావరిలో దూకిన మహిళ

- ముగ్గురూ మృతి
- నిర్మల్ జిల్లా బాసర వద్ద ఘటన
- పిల్లలను స్కూలుకి తీసుకువెళ్లేందుకు రెడీ చేసి..
- స్కూలుకి కాకుండా బాసరకు తీసుకెళ్లి.
- పిల్లలు వద్దని ఏడుస్తున్నా వినకుండా గోదాట్లోకి తోసి..
- మృతులు మహబూబ్‌నగర్ జిల్లా వాసులుగా గుర్తింపు



పిల్లలు భవ్యశ్రీ, బాలాదిత్యతో మానస (ఫైల్)

భైంసా: ఓ మహిళ తన ఇద్దరి పిల్లలను బలవంతంగా నదిలోకి తోసి.. ఆ వెంటనే తానూ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ విషాద ఘటన నిర్మల్ జిల్లా బాసర వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. నిజామాబాద్ జిల్లాకు చెందిన గుర్రం మానస(27)కు మహబూబ్‌నగర్ జిల్లా కోస్గికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వీరికి బాలాదిత్య(9), భవ్యశ్రీ(7) ఉన్నారు. మూడేళ్ల క్రితం భర్త మరణంతో మానసికంగా కుంగిపోయిన మానస అప్పటి నుంచి నిజామాబాద్‌లోని పుట్టింట్లోనే ఉంటోంది. స్థానికంగా ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తూ పిల్లలను చదివిస్తోంది. భర్తను మర్చిపోలేక, కుటుంబ భారం మోయలేక కుంగిపోయింది.

పిల్లలకు లంచ్ తినిపించి...

ఈ క్రమంలో సోమవారం తన ఇద్దరు పిల్లలను స్కూల్‌కు రెడీ చేసింది. బ్యాగు తీసుకుని పిల్లలతో కలిసి నిజామాబాద్ బస్టాండ్‌లో బస్సు ఎక్కి..బాసరకు చేరుకుంది. మొదటి స్నానాల ఘాట్ వద్దకు చేరుకుని మధ్యాహ్నం సమయంలో వెంట తెచ్చుకున్న లంచ్ బాక్సులోని ఫుడ్‌ను పిల్లలకు తినిపించింది. తర్వాత పిల్లలను తీసుకుని నది సమీపంలోకి వెళ్లింది. స్థానికంగా ఉన్నవారు చూస్తుండగానే.. పిల్లలు వద్దని ఏడుస్తూ వారించినా వినకుండా మొదట పిల్లలను నదిలో తోసేసింది. తర్వాత తానూ దూకింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈతగాళ్లతో నదిలో గాలించగా ముగ్గురి మృతదేహాలు లభించాయి. ఘాట్ వద్ద వదిలేసిన స్కూల్ బ్యాగులోని పుస్తకాల్లో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. భర్త మరణంతో మానసికంగా కుంగిపోయి ఈ ఘాతుకానికి పాల్పడిందని మృతురాలి సోదరుడు బత్తుల సందీప్ చెబుతున్నారు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై మహేశ్ తెలిపారు.

- నిధులు విడుదలైతే మరింత క్రీడాభివృద్ధికి అవకాశం

నిధులు అందేనా..?

ఏడేళ్లుగా జీకేవీపీ గ్రాంట్లకు నోచుకోని క్రీడాశాఖ



మహబూబ్‌నగర్‌లోని జిల్లా యువజన, క్రీడాశాఖ కార్యాలయం



జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలో క్రీడాభివృద్ధికి అవసరమైన నిధులను స్థానిక సంస్థల నుంచి సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం 1997లో 1152 జీవో ఉత్తర్వును జారీ చేసింది. కాంట్రిబ్యూషన్ కార్పస్ ఫండ్ కింద గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల నుంచి కొంతమేర క్రీడలకు నిధులు సమకూర్చేందుకు 'గ్రామీణ క్రీడా వికాస పథకాన్ని' అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఏడాదికి జిల్లా పరిషత్ రూ.25వేలు, మండల పరిషత్ రూ.1000, నోటిఫైడ్ గ్రామ పంచాయతీలు రూ.500, నాన్‌నోటిఫైడ్ గ్రామ పంచాయతీలు రూ.250లు డీపీఓ ద్వారా జిల్లా క్రీడాశాఖకు విడుదల చేయాలి. ఉమ్మడి జిల్లాలో గత కొన్నేళ్లుగా ఈ పథకం అమలు తీరు నిరాశాజనకంగా ఉంది.

ఉమ్మడి జిల్లాకు రూ.8.69 లక్షల విడుదల..

జిల్లాల విభజనకు ముందు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కార్పస్ ఫండ్ కింద గ్రామీణ క్రీడా వికాస పథకం కింద రూ.8.69లక్షల నిధులు మాత్రమే విడుదలయ్యాయి. 2006 నుంచి 2015 వరకు గ్రామ పంచాయతీల నుంచి రూ.6.85 లక్షలు, మండల పరిషత్‌ల నుంచి రూ.1.34లక్షలు, జెడ్పీ నుంచి రూ.50వేలు మాత్రమే జిల్లా క్రీడా శాఖకు విడుదల చేశారు. ఇప్పటివరకు మహబూబ్‌నగర్ జిల్లా క్రీడల, యువజన శాఖకు రెండు మండల పరిషత్‌ల నుంచి మాత్రమే నిధులు వచ్చాయి. 2019, 2020 సంవత్సరాల్లో భూత్పూర్ మండలం రెండుసార్లు, మిడ్జిల్ మండలం 2020 సంవత్సరంలో రూ.1000 చొప్పున నిధులు విడుదల చేశాయి.

జీకేవీపీ నిధులతో మరింత క్రీడాభివృద్ధి

ప్రభుత్వం నుంచి కూడా క్రీడాభివృద్ధికి అరకొరగానే నిధులు అందుతున్నాయి. దీంతో జిల్లా యువజన, క్రీడాశాఖకు నిధుల కొరత వేధిస్తోంది. దీంతో క్రీడా పోటీలకు వెళ్లే క్రీడాకారులకు టీఏ, డీఏలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. జీకేవీపీ నిధులు విడుదలయితే క్రీడాభివృద్ధికి అవకాశం ఉంటుంది. కాని గ్రామీణ క్రీడా వికాస పథకం అమలు తీరు సరిగ్గా లేకపోవడంతో జిల్లాలో క్రీడాభివృద్ధికి విఘాతం ఏర్పడుతోంది. జిల్లాలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం అరకొర నిధులు విడుదల చేస్తోంది. గ్రామీణ వికాస పథకం కింద స్థానిక సంస్థల నుంచి సేకరించడానికి అవకాశం కల్పించినా అది కూడా పూర్తిస్థాయిలో అమలుకావడం లేదు. స్థానిక సంస్థల నుంచి స్పందన లేకపోవడంతో కొన్నేళ్ల నుంచి ఈ పథకం అమలుతీరు సరిగ్గాలేదనే వాదనలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల అధికారులు నిధుల విడుదలపై స్పందించకపోవడంతో ఏటా జిల్లా క్రీడాశాఖలకు నిధులు మంజూరు కావడంలేదు.

జీకేవీపీ నిధుల వివరాలు (ఏడాదికి)..	
జిల్లా పరిషత్	రూ.25,000
మండల పరిషత్	రూ.1000
నోటిఫైడ్ జీపీ	రూ.500
నాన్ నోటిఫైడ్ జీపీ	రూ.250

నిధుల విడుదల అంతంతే..

గ్రామీణ క్రీడా వికాస పథకం కింద నిధులు సేకరించడానికి మూడేళ్లక్రితం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నుంచి జిల్లా యువజన, క్రీడాశాఖలకు ఉత్తర్వులు వచ్చాయి. జిల్లా పరిషత్, ఎంపీడీఓలకు, గ్రామ పంచాయతీలకు గ్రామీణ క్రీడా వికాస పథకం కింద నిధుల కోసం సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపాలని ఉత్తర్వులో కోరారు. జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులు జీకేవీపీ నిధుల విడుదల కోసం మండలాలు, గ్రామ పంచాయతీలకు ప్రతిపాదనలు పంపారు. కానీ నిధుల విడుదల మాత్రం అంతంతగానే ఉంది.

మరోసారి ప్రతిపాదనలు



క్రీడాభివృద్ధి కోసం గ్రామీణ క్రీడావికాస పథకం కింద నిధుల కోసం గతంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ అధికారులకు ప్రతిపాదనలు పంపాం. కేవలం రెండు మండల పరిషత్‌ల నుంచి మాత్రమే నిధులు వచ్చాయి. నిధుల కోసం కలెక్టర్ గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం మరోసారి మండల పరిషత్ అధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

'పాలమూరు' జాప్యం కాంగ్రెస్‌దే

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తిటౌన్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో జాప్యానికి కాంగ్రెస్‌పార్టీనే కారణమని.. తెలంగాణను ఆంధ్రాలో కలిపి ఎడారి చేసేందుకు ఆ పార్టీని గెలిపించాలా అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు కేసులు వేసి అడ్డంకులు సృష్టించకుంటే ఈపాటికి పూర్తయ్యేదని తెలిపారు. సోమవారం రాత్రి జిల్లాకేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పెద్దమందడి మండలం గురియకుంటతండాకు చెందిన ముత్యాలమ్మకు మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆదివారం బిజినేపల్లిలో జరిగిన దళిత, గిరిజన ఆత్మగౌరవ సభపై స్పందించారు. కాంగ్రెస్ హయంలో రైతులు తమ భూములు ఎకరాను రూ.30 వేల నుంచి రూ.40 వేలకు విక్రయిస్తే.. నేడు రూ.20 లక్షల పైచిలుకు ధర పలుకుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అన్నివర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని.. మీ మాయ మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. జాతీయస్థాయిలో కాంగ్రెస్ వైఫల్యమే ప్రస్తుత బీజేపీ నియంతృత్వానికి కారణమని మండిపడ్డారు. అధికారం సంగతి తర్వాత.. ముందు ఇంటిపోరును తేల్చుకోవాలని హితవు పలికారు. అధికారం అనేది పగటి కలగానే మిగులుతుందని ఎద్దేవా చేశారు. కేంద్రం ఎనిమిదేళ్లుగా ఉద్యోగాలు భర్తీ చేయకున్నా.. కాంగ్రెస్ నోరు మెదిపింది లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్, టీఆర్ఎస్ నాయకులు లతీఫ్, జాత్రునాయక్ పాల్గొన్నారు.

చేపలపెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ రవీందర్‌రెడ్డి

పెబ్బేరు: చేపల పెంపకం ఎంతో లాభదాయకమని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మత్స్య కళాశాల ఆధ్వర్యంలో చేపల పెట్టుబడి, పరిశుభ్రత, సంరక్షణ పద్ధతులపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నదులు, చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉన్నాయని, శాస్త్రీయ పద్ధతిలో చేపలు పెంచేందుకు పెట్టుబడులు పెట్టి వినియోగించుకోవాలని తెలిపారు. చేపలను రోజువారి ఆహారంగా తీసుకోవడంతో గుండె సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చునని వివరించారు. నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపల పెంపకంపై ఆర్థికసాయం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మత్స్య కళాశాల అసోసియన్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



మాట్లాడుతున్న టీఎస్ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు

- రోజుకు రూ.35 కోట్లు వెచ్చించి కొనుగోలు
- ట్రాన్స్‌ఫార్మర్లు 48గంటల్లో మరమ్మతు చేసి ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదే..
- వినియోగదారుల ముఖాముఖిలో టీఎస్ ఈఆర్సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు

పెబ్బేరు: రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరిగిపోతుందని.. ప్రభుత్వం రోజుకు రూ.35 కోట్లు వెచ్చించి 3 లక్షల యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేస్తుందని.. దీనిని గమనించి రైతులు, వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడాలని తెలంగాణ స్టేట్‌ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు అన్నారు. సోమవారం పెబ్బేరులో వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల వినియోగదారులతో విద్యుత్ సమస్యలు, వినతులపై ముఖాముఖి నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారులు, రైతులు తప్పకుండా తమ హక్కుల గురించి తెలుసుకోవాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైతే వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేయాలని, 48 గంటల్లో అధికారులే తమ వాహనంలో తీసుకెళ్లి మరమ్మతు చేయించి తిరిగి బిగించాలన్నారు. ఒకవేళ రైతుల వాహనాలు వాడుకుంటే అందుకు తగ్గ నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైన విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకొని రైతులు మృతి చెందితే వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి రూ.5 లక్షలు చెల్లించాల్సిన బాధ్యత విద్యుత్ సంస్థలపై ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో విద్యుత్ పంపిణీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్లు చెల్లించిందని వివరించారు. ప్రత్యేక రాష్ట్రం సాకారమయ్యాక అత్యంత పెట్టుబడుటు పెట్టినవి నీటిపారుదల, విద్యుత్ సంస్థేలేనని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో మిగులు విద్యుత్ సాకారం కానుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వినియోగదారులు విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్ల మరమ్మతు, సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమయ్యారని పలువురు వినియోగదారులు ఆరోపించారు. ముఖాముఖిలో పలువురు అధికారుల దృష్టికి పలు సమస్యలను వివరించారు. అనంతరం చైర్మన్ శ్రీరంగారావు స్పందిస్తూ.. లంచం తీసుకున్నా, రైతులను ఇబ్బందులకు గురిచేసినా, దుర్భాషలాడినా సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ఇలాంటి ఘటనల్లో ఆధారాలతో నిరూపిస్తే విచారణ అనంతరం అధికారులను సస్పెండ్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులకు, గృహ వినియోగ దారులకు విద్యుత్ సమస్యలు ఉంటే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని లేదంటే వనపర్తి జిల్లావారు సెల్ నం.73826 05903, గద్వాల జిల్లా వారు సెల్ నం.7901099649కు ఫోన్ చేయవచ్చని, అలాగే 040–2311127/28 లేదా 23397489 చేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో recy@fmai.com మెయిల్‌కు సైతం ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మండలి మెంబర్, టెక్నికల్ ఎండీ మనోహర్ రాజు, ఫైనాన్స్ బండారు కృష్ణయ్య, ఎస్ఈలు నాగేంద్రకుమార్, భాస్కర్, డీఈలు నరేందర్‌కుమార్, భిక్షపతి, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర సబ్ జూనియర్ హాకీ విజేత పాలమూరు

వనపర్తి క్రైం: ఈ నెల 21నుంచి రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ టోర్నీలో ఉమ్మడి పాలమూరు జట్టు విజయకేతనం ఎగరవేసింది. లీగ్ దశలో నల్గొండ జట్టుపై 1–0, నిజామాబాద్‌పై 2–0, హైదరాబాద్‌పై 5–0, రంగారెడ్డిపై 8–0తో విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. సెమీ ఫైనల్ మ్యాచ్‌లో వరంగల్‌పై 10–1తో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్‌లో ఆదిలాబాద్–ఉమ్మడి పాలమూరు జట్లు తలపడగా.. 5–0 గోల్స్‌తో ఉమ్మడి పాలమూరు జట్టు ప్రథమ స్థానంలో నిలిచి విజయకేతనం ఎగరవేసింది. విషయం తెలుసుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డి ఫోన్‌లో ఉమ్మడి పాలమూరు జట్టును ప్రత్యేకంగా అభినందించారు.



ట్రోఫీ, షీల్డ్‌లతో ఉమ్మడి పాలమూరు జట్టు సభ్యులు